వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 345
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
నవంబర్ 06, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## కిక్కిరిసిన జనం..




- జనసంద్రమైన బుగులోని గుట్ట
- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

# అటకెక్కిన.. అగ్రిమెంట్







- 3 నెలల్లో పనుల పూర్తికి ఒప్పందం
- ఆరు నెలలు గడిచినా సా.. గుతోన్న పనులు
- జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియం మేయిన్ గేటుకు తాళం
- కోచ్, డీఎస్‌డీఓ చెప్పినా పట్టించుకోని గుత్తేదారు
- భగ్గుమంటున్న షటిల్ క్రీడాకారులు

హనుమకొండ జిల్లా కేంద్రంలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ పనులు ఆగుతూ.. సాగుతున్నాయి. పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తానంటూ అగ్రిమెంట్ కుదుర్చుకున్న గుత్తేదారు ఆరు నెలలు కావస్తున్నా అరకొర పనులతో క్రీడాకారులకు చుక్కలు చూపిస్తున్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండోర్ స్టేడియం పునరుద్ధరణకు జిల్లా యంత్రాంగం రూ.68 లక్షలు మంజూరు చేయగా, షటిల్ కోర్టులో మ్యాట్లు ఏర్పాటు చేసేందుకు అదనంగా మరో రూ.20 లక్షలు కూడా మంజూరయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి 12 ఏప్రిల్, 2025న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి అట్టహాసంగా అభివృద్ధి పనులను ప్రారంభించారు. అయితే దసరా నాటికే పనులన్నీ పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ మేయిన్ గేటుకు తాళం వేసుకోవడం వివాదంగా మారింది. పనులను పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు మామూళ్ల మత్తులో తూలడంపై షటిల్ క్రీడాకారులు భగ్గుమంటున్నారు. పనుల్లో అలసత్వం వహిస్తున్న ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (టీబీఏ) డిమాండ్ చేస్తోంది.

- వరంగల్ వాయిస్, హనుమకొండ






## చరిత్రాత్మక ఓరుగల్లులో.. ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్ ప్రారంభం

- ముఖ్యఅతిథిగా హాజరైన నటి శ్రీలీల




## ఏసీబీ ట్రాప్‌లో ఏఈఓ

- రైతు బీమా కోసం లంచం డిమాండ్
- రెడ్ హాండెడ్ గా పట్టుకున్న అధికారులు

# అటకెక్కిన.. అగ్రిమెంట్



- 3 నెలల్లో పనుల పూర్తికి ఒప్పందం
- ఆరు నెలలు గడిచినా సా.. గుతోన్న పనులు
- జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియం మేయిన్ గేటుకు తాళం
- కోచ్, డీఎస్ డీఓ చెప్పినా పట్టించుకోని గుత్తేదారు
- భగ్గుమంటున్న షటిల్ క్రీడాకారులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా స్పోర్ట్స్ అథారిటీకి చెందిన జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ పనులకు జిల్లా యంత్రాంగం రూ.68 లక్షలు మంజూరుచేసింది. షటిల్ కోర్టులో మ్యాట్లు ఏర్పాటు చేసేందుకు అదనంగా మరో రూ.20 లక్షలు కూడా మంజూరయ్యాయి. అన్ని పనులను మూడు నెలల్లో పూర్తి చేసేలా గుత్తేదారు అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. అభివృద్ధి పనులను 12 ఏప్రిల్, 2025న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు.

**అడ్డగోలు పనులు..**

స్టేడియంపైనున్న పాత రేకుల స్థానంలో కొత్త రేకులు భిగించారు. అయితే ఇష్టాతిరీతిగా రేకులకు రంధ్రాలు చేయడంతో చిన్నపాటి వర్షానికే స్టేడియంలోకి వాన నీరు వచ్చి చేరుతోంది. దీంతో గతంలో మూడు ప్రాంతాల్లోనే కురిస్తే నేడు అది ఆరు ప్రాంతాల్లో కురుస్తోంది. స్టేడియం చుట్టూరా కిటికీలకు ఫ్రేములు, అద్దాలు భిగించనేలేదు. ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయలేదు. పక్షులు లోనికి రాకుండా పై కప్పు అడుగు భాగం పూర్తిగా క్లోజ్ చేయాల్సి ఉన్నప్పటికీ అసంపూర్తిగానే వదిలేశారు. తూర్పు ద్వారానికి నాసిరకంతో కూడిన గేటును పెట్టారు. దక్షిణ భాగం పైకప్పు నుంచి వర్షపు నీరు రావడంతోపాటు స్టేడియంలోని కోర్టుల్లో సూర్య కిరణాలు పడుతున్నాయి. స్టేడియం చుట్టూరా రిపేర్లను పూర్తిగా మరిచారు. కిటికీలు, తలుపులు చాలా వరకు ఊడిపోయాయి. తూర్పు, పడమరలో ఏర్పాటు చేయాల్సిన పది ఎగ్జాస్ట్ ఫ్యాన్లను దక్షిణ, ఉత్తరం వైపు ఏర్పాటు చేయడంతో చిరు జల్లులకే స్టేడియం చిత్తడిగా మారుతోంది. గ్యాలరీలో ఏర్పాటు చేయాల్సిన టర్బో ఫ్యాన్లకు ఇప్పటి వరకు అతీగతీ లేదు. వాష్ రూమ్ లలో తూతూ మంత్రంగా పనులను ముగించారు. మహిళల గదులకు దర్వాజలు ఏర్పాటు చేయలేదు.

**కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం..**

ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డీఈ, ఈఈల సహకారంతో కోదాడకు చెందిన కాంట్రాక్టర్ బెల్లంకొండ రఘు అభివృద్ధి పనులను చేజిక్కించుకున్నారు. అయితే మొదటినుంచి కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నాసిరకం పనులు, అనాలోచిత నిర్ణయాలతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గత నెల రోజులుగా కాంట్రాక్టర్ పనులు చేయకపోడంతో క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి గుగులోతు అశోక్, షటిల్ కోచ్ కూరపాటి రమేశ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కాంట్రాక్టర్ కు పలు సూచనలు చేసినప్పటికీ ఆయన వాటిని పెడచెవిన పెడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

**నిధులు లేవు..**

హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ పనులకు జిల్లా యంత్రాంగం రూ.68 లక్షలు మంజూరుచేసింది. అయితే ఎక్కడి పనులు అక్కడే పెండింగ్ లో ఉండగానే నిధులు అయిపోయాయంటూ కాంట్రాక్టర్ చేతులెత్తేయడంపై క్రీడాకారులు భగ్గుమంటున్నారు. ఒక దఫా రూ.17 లక్షలు డ్రా చేసినట్లు రికార్డులు చూపుతున్నాయి. మరో రూ.20 లక్షల విడుదలకు కాంట్రాక్టర్ పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. పనులు పెండింగ్ లో పెట్టడంపై సదరు కాంట్రాక్టర్ ను తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు నిలదీస్తుంటే మొత్తం నిధులు ఎప్పుడో అయిపోయాయంటూ ముక్తసరి సమాధానం ఇస్తున్నారు.

**కలెక్టరమ్మ.. జర దేఖో..**

హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ పనులకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఇతర జిల్లా అధికారులతో కలిసి స్థానిక శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి 12 ఏప్రిల్, 2025న అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. అయితే అగ్రిమెంట్ ప్రకారం మూడు నెలల్లో పనులను పూర్తి చేయాలంటూ ఎమ్మెల్యే నాయిని గుత్తేదారుడిని ఆదేశించారు. శంకుస్థాపన చేసిన తర్వాత 18 రోజులకు గుత్తే దారు 1 మే, 2025న పనులను ప్రారంభించారు. పనులను పర్యవేక్షించాల్సిన రాజీవ్ విద్యా మిషన్ డీఈ, ఈఈలు పనుల్లో నాణ్యతను గాలికి వదిలి అందిన కాడికి దండుకున్నట్లు ఆరోపణలున్నాయి. వారి అసమర్థత వల్లే పనులు ఆగుతూ.. సాగుతున్నట్లు క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. అపరిశుభ్రమైన వాతావరణలోనైనా ఆడుకుందామంటే గుత్తేదారు ప్రధాన గేటుకు తాళం వేసుకుంటున్నాడని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు. నిబంధనల మేరకు దసరా నాటికే పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ తో పాటు ముడుపులకు ఆశపడి పనులను ఏ మాత్రం పట్టించుకోని రాజీవ్ విద్యా మిషన్ డీఈ, ఈఈలపై కూడా చర్యలు తీసుకోవాలంటున్నారు.













# ముంపు నుంచి విముక్తి కల్పించండి

- హంటర్ రోడ్ వరద బాధితుల విజ్ఞప్తి
- సమైక్య ఆధ్వర్యంలో రాస్తారోకో
- భారీగా నిలిచిపోయిన వాహనాలు, రాకపోకలకు అంతరాయం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత దశాబ్ద కాలంగా వరదలతో అల్లాడుతున్న మా ప్రాంతాలకు ముంపు నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ హంటర్ రోడ్ వరద బాధితుల సమైక్య ఆధ్వర్యంలో గురువారం ఉదయం హంటర్ రోడ్డులోని 12 మోరీల ప్రాంతంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ రాస్తారోకోలో హంటర్ రోడ్ పరిధిలోని ముంపు ప్రాంతాలైన రామన్నపేట, సంతోషిమాత కాలనీ-1, సంతోష్ మాత కాలనీ-2, సాయినగర్ కాలనీ, బృందావన్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, భద్రకాళి కాలనీ, కాకతీయ కాలనీ, గాయత్రి కాలనీ, శ్రీ అభయాంజనేయ స్వామి కాలనీ, ద్వారకా నగర్ తదితర కాలనీలకు చెందిన పలువురు స్వచ్ఛందంగా రాస్తారోకోలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో తీవ్రమైన వరద ముంపు సమస్యను ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైందంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడపాల్సి వస్తోందని ఆరోపించారు. వరదలకు ప్రధాన కారణం బొంది వాగు నుంచి పెద్ద ఎత్తున వస్తున్న నీటి ప్రవాహం అన్నారు. బొంది వాగు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం అవసరమని, వరద నీరు నేరుగా భద్రకాళి రిజర్వాయర్ లోకి వెళ్ళే విధంగా తగినన్ని గేట్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చెప్పినప్పటికీ ప ట్టిం చు కు నే వా రే కరువయ్యారని ఆరోపించారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఈ పనుల కోసం సుమారు రూ.158 కోట్లు మంజూరు చేసినప్పటికీ ప్రాజెక్టు అమలులో ఎలాంటి పురోగతి లేదని ఆరోపించారు. ఇప్పటికైనా హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ స్పందించి బొంది వాగుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టడంతోపాటు డ్రైనేజీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముంపు ప్రాంతాలకు చెందిన చింతనూరి రవీందర్, పగడాల వెంకటేశ్వర్లు, మల్లెల సిద్ధిరాములు, కుసుమ రమేశ్, వాళ్లపెల్లి




రమేశ్, నంగునూరి సంజీవ్ కుమార్, తోట శ్రీనివాస్ రావు, వలబోజు శ్రీనాథ్, శ్రీహరి, ఎం.నర్సంహారెడ్డి, పూజారి కుమార్, సామల సురేశ్, పాండు, దయాసాగర్, రాజేశ్, రంగు మధు, రఘు, మల్లికార్జున్, ఎం.కాంతయ్య, హరి, శ్రీనివాస్, డాక్టర్ అరవింద్, శంకర్ సింగ్, రాంబాబు, సారంగపాణి, మహిళలు సరోజన, లలిత, చైతన్య, ఎస్.శ్రీలత, టి.ధనలక్ష్మి, సరస్వతి, రాజమణి, బి.ఆశ్రితతోపాటు సుమారు 300 మంది పాల్గొన్నారు.

# జనగామ బ్రిడ్జి నిర్మాణాలపై సీపీఎం ధర్నా

■ ప్రజాప్రతినిధుల రాజీనామాకు డిమాండ్



**వరంగల్ వాయిస్, జనగామ:** జనగామ మండలం పరిధిలోని గానుగుపహాడ్, చిటకోడూరు బ్రిడ్జిల నిర్మాణాలను పూర్తి చేయకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ సీపీఎం బృందం గురువారం ఆ బ్రిడ్జిలను, చిటకోడూరు వాగును సందర్శించి ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి, మండల కార్యదర్శి బోడ నరేందర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి కావాల్సిన ఈ బ్రిడ్జి పనులు నేటికీ పూర్తి కాకపోవడం ప్రభుత్వాల చేతకాని తనానికి నిదర్శనమని విమర్శించారు. ఈ సమస్యను మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి దృష్టికి అనేకసార్లు తీసుకువెళ్లినా ఆయన పరిష్కరించలేదన్నారు. ప్రస్తుత జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గతంలో నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు కూడా ఎందుకు ఈ సమస్యను పరిష్కరించలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ పైన విమర్శలు చేసిన, ప్రస్తుతం రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి (భువనగిరి పార్లమెంట్ సభ్యునిగా ఉన్నప్పుడు) గానీ, ప్రస్తుత ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గానీ కేవలం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం తప్ప సమస్యలు పరిష్కరించలేదని ఆరోపించారు. వందలాది గ్రామాల ప్రజలు, రెండు జిల్లాలు, పదుల మండలాల ప్రజలు రాకపోకలు సాగించే ఈ ముఖ్యమైన రహదారుల పనులకు నిధులు కేటాయించి కూడా పూర్తి చేయకపోవడం చేతకాని తనమేనని అన్నారు. సమస్య పరిష్కారంలో విఫలమైనందుకు నిరసనగా పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి, చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎంపీ పదవికి రాజీనామా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కూడా కనీసం బ్రిడ్జిలను సందర్శించడం లేదని, ప్రజల ఇబ్బందులు ఆయనకు పట్టడం లేదని విమర్శించారు. గతంలో కూడా సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్రలు, ధర్నాలు చేసి కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదని గుర్తు చేస్తూ అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి బ్రిడ్జి నిర్మాణాలను వెంటనే చేపట్టాలని, పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి సాధన కమిటీ సభ్యులు యాసారపు కర్ణాకర్, బాల్నే ఉమాపతి, రాజు యాదవ్ తదితరులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ప్రజలను సమీకరించి దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బోట్ల శేఖర్, బూడిద గోపి, పోత్కానూరి ఉపేందర్, జోగు ప్రకాష్, బాల్నే వెంకట మల్లయ్య, బానోత్ ద, రమావత్ మీట్యా నాయక్, గుండెల్లీ రాజు, భైరగోని మల్లేష్, కూరాకుల శ్రీను, మచ్చ పాండు, బోడ మహేందర్, బోడ స్వామి, చేరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజేపీ బాలుర కళాశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి మెడల్స్




**వరంగల్ వాయిస్, కమలాపూర్:** మహాత్మ జ్యోతిబాపూలే బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు ఇటీవల జరిగిన ఎస్జీఎఫ్ 69 అండర్-19 క్రీడా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో విజయం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.కవితా రెడ్డి తెలిపారు. పి.మన్వీత్ కుమార్ (ఇంటర్ మొదటి సంవత్సరం) హై జంప్ పోటీలలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. ఎం.మన్విత్ (ఇంటర్ మొదటి సంవత్సరం) ట్రిపుల్ జంప్ పోటీలలో రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ను గెలుచుకున్నాడు. రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించిన ఈ ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ పి.కవితా రెడ్డి, ఏటీపీ రాంబాబు, డిడబ్ల్యూ కిరణ్, పీడీ పాక వెంకటేష్ ఘనంగా అభినందించారు.

# ఎన్ హెచ్ఎం ఉద్యోగుల బకాయి వేతనాలు చెల్లించాలి



■ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

**వరంగల్ వాయిస్, అసిఫాబాద్:** నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రావాల్సిన రెండు నెలల వేతనాలు (సెప్టెంబర్, అక్టోబర్ - 2025), ఏడు నెలల పీఆర్, ఏరియర్స్ ను తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్ సఫియోద్దీన్ కి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు కుటుంబ పోషణ కష్టంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే వీరికి కూడా ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్ హెచ్ఎం స్కీమ్లో దాదాపు 78 క్యాడర్లలో సుమారు 17,541 మంది ఉద్యోగులు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానంలో అనేక సంవత్సరాలుగా విధులను నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, అనేక ప్రాంతాల నుండి విధులకు హాజరవుతున్నప్పటికీ, వేతనాలు సకాలంలో అందకపోవడంతో ఇంటి కిరాయిలు, పిల్లల ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. గతంలో జిల్లా స్థాయి అధికారులకు పలుమార్లు వినతులు సమర్పించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో బకాయిల చెల్లింపుతో సహా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న ఉదయం 11 గంటలకు ఎన్ హెచ్ఎం కమిషనర్ కార్యాలయం (డైరెక్టరేట్ కార్యాలయం), హైదరాబాద్ వద్ద మహాధర్నా నిర్వహించాలని ఏఐటీయూసీ నిర్ణయించింది. యూనియన్ తరపున, తమ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఉపాధ్యక్షులు ఆత్మకూరు చిరంజీవి, కోశాధికారి నగేష్, సహాయ కార్యదర్శి రాందాస్, ఎన్ హెచ్ఎం సిబ్బంది శ్రీదేవీ, ప్రకాష్, శ్రీకాంత్, విజయసాగర్, భవాని, సమత తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లా గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ రంజిత్ పాల్గొన్నారు.

# గీతాంజలి సెలూన్ యజమాని కానుగంటి ప్రభాకర్ మృతి

■ సంతాపం తెలిపిన భద్రకాళి పరపతి సంఘం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** గీతాంజలి సెలూన్ యజమాని, శ్రీ భద్రకాళి పరపతి సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కానిగంటి ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల శ్రీ భద్రకాళి పరపతి సంఘం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. సంఘం అధ్యక్షులు గుళ్లపల్లి రాజ్ కుమార్ అధ్యక్షతన ఎస్ఆర్ నగర్లోని ప్రభాకర్ నివాసం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ శ్రీ భద్రకాళి పరపతి సంఘం నిబంధనల ప్రకారం అకాల మరణం చెందిన ప్రభాకర్ కుటుంబానికి రూ.50,000 ఆర్థిక సహాయాన్ని ఆయన సతీమణి రజిత, కుమార్తె గీతాంజలి, కుమారుడు భరత్ కు అందజేశామని తెలిపారు. గుళ్లపల్లి రాజ్ కుమార్ మాట్లాడుతూ శ్రీ భద్రకాళి పరపతి సంఘం సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, తమ సంఘం సామాజిక బాధ్యత కలిగినదని, సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సంఘం తరపున తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ ప్రధాన కార్యదర్శి గోగికార్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ సంఘీభావం సభ్యులలో ఉన్న నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణకు నిదర్శనమని అన్నారు. సభ్యులందరి ఐక్యత ఇలాగే కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. భద్రకాళి కార్యవర్గ సభ్యులు అందరూ ప్రభాకర్ మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సంతాప కార్యక్రమంలో గోరంటల మనోహర్, మాటేటి విద్యసాగర్, సిద్దోజు శ్రీనివాస్, దయ్యాల ప్రభాకర్, సల్ల రాజేందర్, గుళ్లపల్లి సాంబశివుడు, ఇప్పలపల్లి శివాజీ, కోయల్ కార్ నంద కిషోర్, పొత్తునూరి రాజు, తేలి పున్నం చందర్, చిలువేరు థామస్, సిందం చంద్రశేఖర్, రామ యాదగిరి, ములక సురేష్, బండారి రాజేశ్వర్ రావు, సభ్యులు కోరే అనిల్ కుమార్, వెలగందుల వేణు, రఘు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది ఆంజనేయులు దంపతులకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, పరకాల :** మండల విశ్రాంత అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు దంపతులను పద్మశాలి జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. మండల విశ్రాంత అభివృద్ధి అధికారిగా పనిచేసిన వీరిని సంఘం ప్రతినిధులు శాలువా కప్పి, తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ఉపాధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి వల్లాల వెంకట రమణారెడ్డి, కోశాధికారి వేముల సదానందం నేతతో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ది ఆంజనేయులు విశ్రాంత జీవితం సంతోషకరంగా కొనసాగాలని పద్మశాలి జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు ఆకాంక్షించారు.

# కిషన్ రెడ్డి ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతున్నారు

### టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఆరు గ్యారెంటీల అమలుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన రహమత్ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే, కిషన్ రెడ్డి కళ్లుండి చూడలేని కబోదిగా మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. గత 11ఏళ్లుగా అధికారంలో ఉన్న కిషన్ రెడ్డి, తన ఎంపీ పరిధిలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఏపాటి నిధులు తెచ్చారో, ఈ మురికివాడల సాక్షిగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి ఇప్పుడు మళ్లీ ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడగడానికి వచ్చారో ప్రజలకు చెప్పాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రతి పేదవాడి బ్యాంకు అకౌంట్‌లో రూ. 15 లక్షలు వేస్తామని చెప్పి మోసం చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. అదేవిధంగా, గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా జూబ్లీహిల్స్ పేదలకు చేసిందేమీ లేదని బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ అభివృద్ధి చేసి ఉంటే, ఇంకా ఈ ప్రాంత పేదలు సమస్యలతో ఎందుకు సతమతమవుతున్నారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తున్నది. కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది. 70 వేలకు పైగా కొత్త ఉద్యోగాలు ఇచ్చిందన్నారు.

# రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌ను కలిసిన ములుగు జర్నలిస్టులు



**వరంగల్ వాయిస్, ములుగు:** జిల్లాకు చెందిన జర్నలిస్టులు, ఐ.జే.యూ (ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్) నాయకులు గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌ను కలిసిన వారిలో ఐ.జే.యూ ములుగు జిల్లా అధ్యక్షుడు షఫీ హమ్మద్, ఉపాధ్యక్షులు బేతి సతీష్ యాదవ్, కార్యదర్శి చిదిరాల వాసు ఉన్నారు. ఈ సందర్భంగా వారు ములుగు జిల్లా జర్నలిస్టుల స్థితిగతులు, పరిస్థితులను చైర్మన్‌కు వివరించారు. అనంతరం, రంగారెడ్డి జిల్లాలోని పొద్దుటూరులో గల ప్రగతి రిసార్ట్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐ.జే.యూ) రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో ములుగు జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ములుగు జిల్లాలో ఐజేయూ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను వారు వివరించారు. ఐజేయూ ఆధ్వర్యంలో ములుగు జిల్లాలో పూర్తి చేసిన సభ్యత్వ నమోదు పుస్తకాలను రాష్ట్రస్థాయి బాధ్యులకు అందజేశారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిగా సభ్యత్వాలు పూర్తి చేసినందుకు గాను, రాష్ట్ర నాయకత్వం ములుగు జిల్లా ఐ.జే.యూ నాయకులైన షఫీ, సతీష్, వాసులను అభినందించింది. ములుగు జిల్లా ఐజేయూ నాయకులు ఇటీవల హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా గెలుపొందిన రాజేష్ యాదవ్ ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు, శాలువాలతో సన్మానించి అభినందించారు. ఐజేయూ జాతీయ నాయకులు, సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ని సైతం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం సాయంత్రం వరకు కొనసాగింది.

# వీరుల త్యాగాలు మరువలేనివి



**వరంగల్ వాయిస్, ఖానాపురం :** సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా, నవంబర్ 1 నుంచి 9 వరకు జరుగుతున్న అమరవీరుల వర్ధంతి సభలు ఖానాపురం మండల కేంద్రంలోని అశోక్ నగర్‌లో ఘనంగా జరిగాయి. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు గట్టి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కామ్రేడ్ మురళి స్తూపం వద్ద ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు ప్రసంగించారు. వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం ఎందరో వీరులు, ధీరోదాత్తులు తమ అమూల్యమైన ప్రాణాలను పీడిత ప్రజల కోసం తృణప్రాయంగా అర్పించారని అన్నారు. ఈ వీరుల త్యాగాలను మననం చేసుకుంటూ, వారి ఆశయ సాధనలో కంకణ బద్ధులమై పోరాడాలని పిలుపునిచ్చారు. అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలించి, దాని స్థానంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడం కోసం అనేకమంది విప్లవ వీర కిశోరాలు నేల రాలారని, వారి త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. నూతన సమాజం కోసం అమరులు చూపిన త్యాగాల బాటలో పునరంకితం కావాలని అన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో "దున్నేవానికి భూమి కావాలని" పోరాడి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన చరిత్ర విప్లవకారులదని గుర్తు చేశారు. వారి అసమాన త్యాగాలకు గోదావరి లోయ నెత్తుటి సాక్ష్యాలుగా నిలిచిందని పేర్కొన్నారు. కామ్రేడ్ మురళితో పాటు చంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, చారు మజుందార్, కాచనపల్లిలో ఐదుగురు కామ్రేడ్స్ వంటి అనేకమంది వీరులు నక్సల్ బరి, శ్రీకాకుళం, ముషహరి, గోదావరి లోయ తదితర ప్రాంతాల్లో జరిగిన ప్రతిఘటన పోరాటాలలో అసువులు ఒడ్డి అమరులయ్యారని తెలిపారు. కామ్రేడ్ మురళి రోళ్లగడ్డ అడవుల్లో రాజ్యాహంకారానికి ప్రతీకగా అతి దారుణంగా రాజ్యం, పోలీసు గుండాల ముఠాలు బూటకపు ఎన్‌కౌంటర్ చేశాయని గుర్తు చేశారు. కామ్రేడ్ మురళి, ఇతర అమరుల త్యాగాలను పుణికిపుచ్చుకుని, వారి ఆశయ సాధనలో ప్రయాణిస్తేనే వారికి నిజమైన వారసులుగా ఉంటామని పేర్కొన్నారు. ఈ విప్లవ వీరులు ప్రజల హృదయాలలో సదా చిరస్మరణీయులుగా వెలుగొందుతారని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు గుర్రం అజయ్, భర్దాజి, భిక్షపతి, పానీ, పూలక్క, ఉప్పాలన్న, దేవి, మోహన్, రఘు, సాంబన్న, వెంకట్ రెడ్డి, యాకమ్మ, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ నిబంధనలతో పత్తి రైతులకు అన్యాయం

### మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** భారతీయ పత్తి సంస్థ 'సీసీఐ' నిబంధనల వల్ల పత్తి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వెంటనే కేంద్ర ప్రభుత్వం సీసీఐ నిబంధనల్లో మార్పులు చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. చందుపట్ల రాజిరెడ్డి గురువారం మాట్లాడుతూ తేమ శాతం పెంపు ఈ సీజన్‌లో కురిసిన అకాల వర్షాల వల్ల పత్తిలో తేమ శాతం అధికంగా 18 శాతం నుంచి 20 శాతం వరకు వస్తుంది. అకాల వర్షాల వల్ల ఇప్పటికే నష్టపోయిన రైతులకు అండగా ఉండేందుకు, కేంద్రం ప్రస్తుతం ఉన్న తేమ శాతం పరిమితిని 8శాతం నుంచి 12శాతం వరకు కాకుండా, దానిని 18శాతం నుంచి 20శాతానికి పెంచాలి. ప్రస్తుతం ఎకరానికి ఉన్న 7 క్వింటాళ్ల పరిమితిని రద్దు చేసి, గతంలో మాదిరిగానే ఎకరానికి 12 క్వింటాళ్ల పరిమితిని తిరిగి అమలు చేయాలి. కొత్తగా ప్రవేశపెట్టిన స్లాట్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలి. సీసీఐ నిబంధనల్లో భాగంగా ప్రవేశపెట్టిన L1, L2, L3 వంటి నూతన విధానాల వల్ల రైతులు అయోమయానికి గురవుతున్నారని, అంతేకాకుండా రైతులకు రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని అన్నారు. ఈ పద్ధతిని వెంటనే నిలిపివేయాలి. తేమ శాతం, పరిమితులు, కొత్త విధానాలు వంటి సీసీఐ నిబంధనల కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, కేంద్రం తక్షణమే స్పందించి రైతులకు అనుకూలంగా నిబంధనలను సవరించాలని ఆయన కోరారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని సోమాజిగూడ 288వ బూత్ పరిధిలో గల శ్రీనగర్ కాలనీలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఈ ప్రచారంలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతాయని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# నల్ల నర్సింహులు స్ఫూర్తితో పోరాడాలి

### ▪ తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్:** నిరంకుశ రాచరిక పాలన, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం వీరోచితంగా పోరాడిన నల్ల నర్సింహులు చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన అవసరం ఉందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. వరంగల్ కొత్తవాడలోని అమరవీరుల స్తూపం వద్ద నల్ల నర్సింహులు 32వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ జనగామ తాలూకా కడివెండిలో నిరుపేద చేనేత కుటుంబంలో పుట్టిన నర్సింహులు, విసునూరు రామచంద్రారెడ్డి వంటి దొరల దౌర్జన్యాలు సహించలేకపోయారని అన్నారు. ఆయన కూలినాలీ చేసుకునే వారిని సంఘటితం చేసి సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి, దొరల గుండెల్లో సింహ స్వప్నంగా నిలిచారని కొనియాడారు. అనేకసార్లు అరెస్ట్ అయ్యి, చిత్రహింసల పాలై, ఉరిశిక్ష విధించినప్పటికీ, మొక్కవోని ధైర్యంతో పోరాడి 'తెలంగాణ టైగర్'గా ప్రపంచ ప్రసిద్ధిగాంచారని గుర్తు చేశారు. ఆయన ధైర్య సాహసాలతో చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. నల్ల నర్సింహులు స్ఫూర్తితో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు రాజ్యాధికారంలో, విద్యా, ఉద్యోగ రంగాల్లో న్యాయమైన వాటా కోసం "మేమెంతో-మాకంతా" నినాదంతో పోరాడాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఆ విధంగా పోరాడటమే నల్ల నర్సింహులుకు ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దామెర సర్వేశం, పిట్ట రాములు, ఆడేపు రవి, రాజేశం, శ్రీనివాస్, రమేష్, మండల శంకర్, దానం రాజయ్య, కూచన రవి, తాటిపాముల నర్సయ్య, గోనె భిక్షపతి, సామల భిక్షపతి, బస్వరాజు మల్లేశం, కలకోట యోగానందం, గుల్లేపల్లి రవీందర్, బుదారపు సదానందం, సందెల దామోదర్, పెండెం మల్లికార్జున్ పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, నవంబర్ 06, 2025

# బీసీ రిజర్వేషన్లకై రాజ్యాంగ సవరణ జరగాల్సిందే

■ **బీసీ జేఏసీ నాయకుల మౌన దీక్ష**




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం దగ్గర బీసీ జేఏసీ నాయకులు మౌన దీక్ష చేపట్టి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ జనాభాలో కేవలం 10 శాతం ఉన్న అగ్రవర్ణాలు రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకొని, అన్ని రంగాలను శాశిస్తూ, బీసీలను అణగదొక్కుతున్నారని మండిపడ్డారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు మాత్రం అగ్రవర్ణ పార్టీలకు జెండాలు మోసే కార్యకర్తలుగా, ఓట్లు వేసే యంత్రాలుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు మద్దతునిచ్చిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పుడు రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తూ బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. దేశంలో ఈడబ్ల్యూఎస్ (EWS) రిజర్వేషన్లు వచ్చిన తర్వాత రిజర్వేషన్లు లేని వర్గం అంటూ ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని పల్లె పల్లెకు విస్తరించి, బీజేపీకి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. దగాపడ్డ బీసీలు దండు కట్టే సమయం ఆసన్నమైందని, తెలంగాణ ఉద్యమ తరహాలోనే బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. డిసెంబర్ మొదటి వారంలో బీసీల చలో ఢిల్లీ, పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. జనవరి 4వ వారంలో 'లక్ష మందితో వేల వృత్తులు.. కోట్ల గొంతులు' అనే నినాదంతో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. గురువారం చేపట్టిన మౌన దీక్ష కార్యక్రమానికి లంబాడి హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ ఛైర్మన్ దాడి మల్లయ్య యాదవ్, బోనగాని యాదగిరి గౌడ్, బీసీ జేఏసీ మహిళా నాయకురాళ్లు తమ్మేలా శోభరాణి, మాదం పద్మజదేవి, తెల్ల సుగుణ, హైమావతి, బీసీ జేఏసీ జిల్లా నాయకులు బచ్చు ఆనందం, దాడి రమేష్ యాదవ్, గొట్టే మహేందర్, డా.ఒడితల రాము, తంగళ్లపెల్లి రమేష్, పంజల మధు గౌడ్, జ్ఞానేశ్వర్, రజనీకాంత్, పొన్నం సంపత్, చాగంటి రమేష్, వెంకటేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖ ఇంటి ముట్టడి




■ **ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకుల అరెస్ట్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో గురువారం మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులకు, పోలీసులకు మధ్య తీవ్ర ఉత్కంఠ వాతావరణం నెలకొంది. అనంతరం పోలీసులు విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి సుబేదారి పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాడల్ల శరత్ లు మాట్లాడుతూ ఫీజు బకాయిల విడుదల ఎందుకు ఆలస్యం?: గత నాలుగు రోజులుగా పీజీ, డిగ్రీ, ఫార్మా, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజనీరింగ్ వంటి వివిధ విద్యాసంస్థల నిరవధిక బంద్ కారణంగా 18 లక్షల మంది విద్యార్థులు ఇంటికే పరిమితమైనా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. పేద విద్యార్థులు చదువుతున్న కళాశాలలకు పది వేల కోట్ల రూపాయలకు పైగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం బాధాకరమని తెలిపారు. ఇది బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్రేనని వారు ఆరోపించారు. తమ ఫీజులు చెల్లించాలని విద్యార్థులు రోడ్డు ఎక్కుతుంటే, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాసంస్థలపై విజిలెన్స్ దాడులు చేస్తామని బెదిరించడం దుర్మార్గపు చర్య అని భాషబోయిన సంతోష్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా, కనీసం విద్యార్థుల సమస్యలను పరిష్కరించే ఆలోచన లేకపోవడం విచారకరం అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటే ఏఐఎస్ఎఫ్ చూస్తూ ఊరుకోదని నాయకులు హెచ్చరించారు. తక్షణమే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఒట్కూరి ప్రణీత్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు దిడ్డి పార్థసారథి, జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, జక్కుల భానుప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి, జిల్లా సమితి సభ్యులు సిపతి వినయ్, చరణ్ గౌడ్, రాజు, రమేష్, రమ్య, సృజన, సౌమ్యలతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# రెండు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలి

■ **డీఎంహెచ్‌వో ఉమా గౌరీకి వినతి**



**వరంగల్ వాయిస్, మేడ్చల్ మల్కాజ్‌గిరి :** జాతీయ ఆరోగ్య మిషన్ కింద పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు, ఏడు నెలల పీఆర్సీ, ఏరియర్స్ ను తక్షణమే చెల్లించాలని ఎన్హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉపాధ్యక్షురాలు సిద్దిపేట రాజేశ్వరి రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయంలో డీఎం హెచ్‌వో ఉమా గౌరీకి సిద్దిపేట రాజేశ్వరి రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట రాజేశ్వరి రెడ్డి మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు కుటుంబ పోషణ కష్టమై, అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు చెల్లించలేక ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తమకు కూడా ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించని పక్షంలో, నవంబర్ 17, 2025, సోమవారం రోజున ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని కోఠి వద్ద ఉన్న కమిషనర్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తామని ఆమె ప్రభుత్వానికి తెలియజేశారు. ఎన్ హెచ్ఎంలో దాదాపు 78 క్యాడర్లలో సుమారు 17,541 మంది ఉద్యోగులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగులు నిత్యం క్రింది స్థాయి ప్రజానీకానికి అందుబాటులో ఉంటూ, పేద మరియు మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నాయకులు పద్మ, కళావతి, రిషిక, మణెమ్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు చల్లా పరామర్శ



**వరంగల్ వాయిస్: పరకాల :** మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు గురువారం పరకాల మండలం పోచారం గ్రామంలో పర్యటించారు. ఇటీవల పిడుగుపాటు కారణంగా మరణించిన కూస (గోనె) మహిపాల్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మహిపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, పిడుగుపాటుతో మృతి చెందిన మహిపాల్ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా వచ్చే తక్షణ సహాయం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని చల్లా ధర్మారెడ్డి హామీ ఇచ్చారు. అదేవిధంగా, పరకాల మండలం పోచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గడ్డం చంద్రమౌళి ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్నారు. చల్లా ధర్మారెడ్డి గారు చంద్రమౌళిని కూడా పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా వెంట మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు ఉన్నారు.

# మహిళా డెయిరీ ఏర్పాటుపై సమీక్ష



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** పరకాల నియోజకవర్గంలోని దామెరలో ఏర్పాటు చేయనున్న పరకాల మహిళా డెయిరీ సంబంధించి మిగిలిన అనుమతులు, నిర్వహణ అంశాలపై హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్తో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నిర్వహించారు. డీఆర్‌డీఓ, సహకార, పశుసంవర్ధక శాఖల అధికారులు, మహిళా డెయిరీ నిర్వాహకులు ఇందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు సంబంధించిన అన్ని అనుమతుల ప్రక్రియను అధికారులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ డెయిరీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు, నిర్వాహకులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం సభ్యత్వం ఉన్న 21 మంది ఆధార్ కార్డులను రెండు రోజుల్లో అందజేయాలని, అలాగే ఫీజుబిలిటీ రిపోర్ట్ను త్వరగా అందజేస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని తెలిపారు. డెయిరీ నిర్వహణ బాధ్యతలను సొసైటీలోని మహిళలే చేపట్టడం మంచిదన్నారు. హనుమకొండ డీఆర్‌డీఓ మేన శ్రీను, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, మహిళా డెయిరీ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంజినీరింగ్ భవిష్యత్తుపై ఏఐ ప్రభావం



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (కేయూసీఈ అండ్ టీ), హనుమమకొండలోని ఇంటర్న్‌షిప్ సెల్ ఆధ్వర్యంలో గురువారం "AI Beyond Algorithms and into Engineering" అనే అంశంపై ఆసక్తికరమైన ఉపన్యాస కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కామన్ కలెక్టివ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ కౌన్సిల్ రాజశేఖర్ పాథూరి ప్రధాన వక్తగా పాల్గొని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలపై లోతైన అవగాహనతో కూడిన ప్రసంగం చేశారు. కృత్రిమ మేధా ఇంజినీరింగ్ భవిష్యత్తును ఎలా ప్రభావితం చేస్తుందో వివరిస్తూ, విద్యార్థులతో చురుకైన చర్చ జరిపి, వారి సందేహాలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.రమణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్లు డి.ప్రియాంక, ఫరీన్ ఫాతిమా, ఎం.సౌజన్య, ఆర్.లక్ష్మణ నాయిక్, రుమానా అబీదీన్ పాల్గొన్నారు.

# శిక్షణతోనే పనిలో సామర్థ్యం పెంపుదల



**వరంగల్ వాయిస్, కేయూ :** "శిక్షణ ద్వారానే పనిలో సామర్థ్యం పెరుగుతుంది" అని కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్ హెచ్.ఆర్.డీ ఇన్ స్టిట్యూట్)" ఆధ్వర్యంలో అక్టోబర్ 6 నుంచి నవంబర్ 4 వరకు నిర్వహించిన 30 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బందిని వీసీ అభినందించారు. ఈ శిక్షణలో జూనియర్ అసిస్టెంట్లు ఎం.రాజేష్, డి.ప్రవీణ్ కుమార్, కే.రజని, కే.ప్రవక్షిత్ కుమార్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం డైరెక్టర్ జనరల్ శాంతి కుమారి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ 30 రోజుల శిక్షణలో కండక్ట్ రూల్స్, ఫండమెంటల్ రూల్స్, లీవ్ రూల్స్, ఆఫీస్ విధి విధానాలు, ఫైనాన్షియల్ కోడ్, ట్రెజరీ యాక్ట్, ఆర్‌టీఐ చట్టం వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించారని ఉద్యోగులు తెలిపారు. శిక్షణ పూర్తిచేసి తిరిగి వచ్చిన వారిని రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం

# కోటగుళ్ల శిల్ప సంపద అద్భుతం

## భూపాలపల్లి ఆర్డీవో రవి



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయులు నిర్మించిన కోట గుళ్ళు శిల్ప సంపద ఎంతో అద్భుతమని భూపాలపల్లి ఆర్డీవో రవి అన్నారు. కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిసారి ఆలయాన్ని సందర్శించడం జరిగిందని కోటగుళ్ళు ఆలయం రామప్పను పోలిన విధంగా ఉందన్నారు. మరోసారి ఆలయాన్ని సందర్శిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట గణపురం తహసిల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి తదితరులున్నారు.

# జాతర వేలం పాటలు పూర్తి

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మినీ మేడారం గా ప్రసిద్ధిగాంచిన అగ్రంపాడు సమ్మక్క సారలమ్మ జాతరలో వేలంపాటలను గురువారం ఎండోమెంట్ సహాయ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరి ముక్కలను పోగు చేసుకునేందుకు వేలం పాట గత జాతరలో 78,216 రూపాయలు కాగా ఈ జాతరలో రూ.2, 15,000 వేలకు పాట తీసుకోవడం జరిగింది. అలాగే పుట్టు వెంట్రుకలు ప్రోగు చేసుకునే హక్కు గత జాతరలో రూ. 1,35000 కాగా, ఈ జాతరలో 1,50,000 వేలకు పాట పోయింది. అలాగే సైకిల్ స్టాండ్ హక్కు కోసం గత జాతరలో రూ.1,71,000 కాగా ఈసారి జాతరకు రూ.3, 23,000 పాటకు దక్కింది. అలాగే పేలాలు పుట్నాలు అమ్ముకోవడానికి గత జాతరలో రూ.5500 పాట కాగా ఈసారి జాతరకు రూ.6100లకు ఖరారు జరిగింది. మొత్తం నాలుగు వేలం పాటలు గత జాతరలో రూ.3, 89,716 కాగా ఈసారి వేలం పాటల్లో రూ.6,94,100 రూపాయలకు పాటలు ఖరారయ్యాయి. గత జాతర కంటే రూ.3, 04,384 ఆదాయం అదనంగా చేకూరిందని జాతర ఈవో అద్దంకి నాగేశ్వరరావు తెలిపారు. బెల్లం కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు, లడ్డు పులిహోర అమ్ముకునే హక్కు కోసం జరిగిన వేలం పాటల్లో ఎవరు పాల్గొనకపోవడంతో వాయిదా వేసామని తిరిగి ఈనెల 25న వేలం పాట నిర్వహిస్తామని ఈవో తెలిపారు. వేలం పాటలకు వరంగల్ డివిజన్ పరిశీలకులు డి.అనిల్ కుమార్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ వీర సునంద సుధాకర్ రెడ్డి, మాజీ చైర్మన్ బోరిగం స్వామి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఏలియా, జాతర పూజారులు గోనెల సారంగపాణి, బొల్లెపల్లి సాంబశివరావు, గోనెల రవీందర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్ నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి




- పీడీఎస్ యూ నాయకుల డిమాండ్

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ (కేయూ)లో పీజీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ర్యాగింగ్ బారిన పడకుండా యూనివర్సిటీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం పీడీఎస్ యూ ప్రతినిధి బృందం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంకి వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా పీడీఎస్ యూ కేయూ ప్రధాన కార్యదర్శి వి.కావ్య, ఉపాధ్యక్షురాలు పి.అనూష మాట్లాడుతూ కేయూలోని బాయ్స్, గర్ల్స్ హాస్టల్స్, వివిధ డిపార్ట్మెంట్లలో పీజీ మొదటి సంవత్సరం విద్యార్థులను సీనియర్లు 'ఇంటరాక్షన్' పేరుతో వేధించే అవకాశం ఉందని తెలిపారు. పరిచయ కార్యక్రమాలను సంబంధిత అధ్యాపకుల సమక్షంలోనే నిర్వహించాలి తప్ప, అధ్యాపకుల ప్రమేయం లేకుండా ఇంటరాక్షన్ పేరుతో జూనియర్ విద్యార్థులను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ హాస్టల్స్‌లో సంబంధిత జేడీలు, సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించి, నూతన విద్యార్థులకు భరోసా కల్పించాలని కోరారు. ర్యాగింగ్ వలన జరిగే దుష్పరిణామాల పట్ల వివిధ డిపార్ట్‌మెంట్‌లలోని విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో ర్యాగింగ్‌ను ఉపక్షించేది లేదని, ర్యాగింగ్‌కు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ కేయూ నాయకులు గణేష్, శ్రీజ, రాము, సాధన, సంగీత తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన ప్రైవేట్ కాలేజీల మేనేజ్‌మెంట్లు




- బకాయిలు విడుదల చేయకుంటే ఆందోళన ఉధృతం
- సుందర్ రాజ్ యాదవ్ అల్టిమేటం

**వరంగల్ వాయిస్, సుబేదారి:** ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల (స్కాలర్‌షిప్‌ల) బకాయిలు విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాలు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రోడ్డెక్కాయి. డిగ్రీ అండ్ పీజీ కాలేజీల వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్. సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలో తీవ్ర ఆందోళన నిర్వహించారు. కళాశాలలకు తాళాలు: యాజమాన్యాలు తమ కళాశాలలకు తాళాలు వేసి నిరవధిక బంద్ ప్రకటించాయి. హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్ద సంఖ్యలో కళాశాలల మేనేజ్‌మెంట్లు, సిబ్బంది ధర్నా నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సుందర్ రాజ్ యాదవ్ నేతృత్వంలో యాజమాన్యాలు వరంగల్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కలెక్టరేట్ వద్ద టెన్షన్ వాతావరణం నెలకొంది. కళాశాలలు మూసివేయడం వలన నిరుపేద విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని, ప్రభుత్వం వారి భవిష్యత్‌ను ఫణంగా పెడుతోందని ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఆందోళన సందర్భంగా ఎస్. సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు ఉచితంగా విద్యా బోధన చేస్తున్నాయని తెలిపారు. బకాయిలు పేరుకుపోవడంతో అధ్యాపకుల జీతాలు, భవనాల అద్దెలు, కరెంటు బిల్లులు, యూనివర్సిటీ రుసుంలు, బిల్డింగ్ టాక్స్ వంటివి చెల్లించలేక యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన అనంతరం డిగ్రీ అండ్ పీజీ కాలేజెస్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్. సుందర్ రాజ్ యాదవ్ నేతృత్వంలో కళాశాలల యాజమాన్యాలు కలెక్టర్ స్నేహ శబరిష్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని, విద్యార్థులు, విద్యారంగాని సహనం నశిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వం రుచి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ కాలేజీల అసోసియేషన్ ట్రెజరర్ వేణుమాధవ్, సంజీవ్ రెడ్డి, నారాయణ రెడ్డి, కృష్ణమోహన్, హరేందర్ రెడ్డి, శ్రీనివాస్ తో పాటు డిగ్రీ, పీజీ కాలేజీల యజమానులు, టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# 13న ధర్నాను జయప్రదం చేయండి

- శ్రీధర్ల ధర్మేంద్ర పిలుపు

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల సాధన కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కందుకూరి దేవదాసు అధ్యక్షతన హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కో కన్వీనర్ శ్రీధర్ల ధర్మేంద్ర మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కమిటీ వివిధ జిల్లాల్లో పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 13న వరంగల్ జిల్లా ఏకశిలా/జయశంకర్ పార్క్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని రిటైర్డ్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఇటీవల రాష్ట్ర కమిటీకి కో కన్వీనర్‌గా ఎన్నికైనందుకు జిల్లా కమిటీ ఆయనకు అభినందనలు తెలియజేసింది. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి భోగేశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగులు రిటైర్ అయిన తర్వాత తమ శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని కోరుకుంటారని, ఇందుకోసం వారు తమ ఉద్యోగ జీవితంలో జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్, కమ్యుటేషన్, గ్రాట్యుటీ, 2020 పీఆర్సీ ఏరియర్స్ వంటివి దాచుకుంటారని తెలిపారు. ఈ బకాయిలు ఉద్యోగుల హక్కు అని, వీటి ద్వారా వారు పిల్లల పెళ్ళిళ్ళు, ఇళ్ల నిర్మాణం, బ్యాంక్



ఈఎమ్ఐలు కట్టుకుని ప్రశాంత జీవితం గడపాలని ఆశ పడతారని పేర్కొన్నారు. అయితే, ఈ బకాయిలు విడుదల కాకపోవడంతో ఆశలు అడియాశలు అయ్యాయని, 2024 నుండి రిటైర్డ్ అయిన ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులతో మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 20 మంది మనోవేదనతో మరణించారని చెబుతూ, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కో కన్వీనర్ ఎస్. ధర్మేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి భోగేశ్వర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కందుకూరి దేవదాసు, ఎండీ.గఫార్, మేకిరీ దామోదర్, ఈ.ఇంద్రసేనారెడ్డితో పాటు సభ్యులు బత్తిని సారయ్య, అశోక్ కుమార్, వెంకటయ్య రవీందర్, సంజీవరెడ్డి, శ్యాంసుందర్, సాంబయ్య వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# దుల్కర్ కాంత

## మూవీ ట్రైలర్ విడుదల

మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ , దగ్గుబాటి రానా మల్టీస్టారర్‌గా వస్తున్న చిత్రం 'కాంత'. ఈ సినిమాకు తమిళ దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. సముద్రఖని కీలక పాత్రలో నటిస్తున్నాడు. స్పిరిట్ మీడియా, వేఫరర్ ఫిల్మ్స్ పతాకాలపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 1950 మద్రాస్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం నవంబరు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఊదిపడేయ డానికి నేను మట్టిని కాదు.. పర్వతాన్ని..' అంటూ దుల్కర్ చెప్పే డైలాగులు ఆకట్టుకుంటున్నాయి.



## తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన కుంభమేళా మోనాలిసా

సోషల్ మీడియా వచ్చాక చాలామంది ఫేమస్ అవుతున్నారు. తమ టాలెంట్‌తో ముందుకు సాగుతున్నారు. . మహాకుంభమేళాలో దేవుడిని దర్శించుకొని రాకుండా కొంతమంది యూట్యూబర్స్ ఒక పూసలు అమ్మే అమ్మాయిని వీడియోలు తీసి సోషల్ మీడియా సెన్సేషన్ గా మార్చారు. ఆమె మోనాలిసా. కలువ రేకుల్లాంటి కళ్లు.. హీరోయిన్ ను మించిన అందం అంటూ మోనాలసాను ఆకాశానికి ఎత్తారు. ఇక ఆ వీడియోలు వైరల్ గా మారి మోనాలిసా సెలబ్రిటీగా మారడమే కాకుండా హీరోయిన్ గా కూడా ఛాన్స్ దక్కించుకుంది. ఇప్పటికే బాలీవుడ్ డైరెక్టర్ ఆమెను హీరోయిన్ గా చేస్తానని మాట ఇచ్చి తప్పిన విషయం తెల్సిందే. ఆ సినిమా మొదలు కాకముందే ఆగిపోయింది. ఇక ఇప్పుడు మోనాలిసా టాలీవుడ్ కు ఎంట్రీ కూడా ఎంట్రీ ఇచ్చింది. ఇటీవలే ఆమె నటిస్తున్న తొలి తెలుగు సినిమా పూజా కార్యక్రమాలతో మొదలయ్యింది. ఇట్స్ ఓకే గురు, క్రష్ లాంటి సినిమాలతో తెలుగుతెరకు పరిచయమైన హీరో సాయి చరణ్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం లైఫ్. శ్రీను కోటపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను శ్రీ వెంగమాంబ మూవీస్ బ్యానర్ పై అంజయ్య విరిగినేని, ఉష విరిగినేనిలు నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాలో సాయి చరణ్ సరసన మోనాలిసా హీరోయిన్ గా నటిస్తోంది. మంచి కథతో తెరకెక్కుతున్న చిత్రమని, పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ కు ప్లాన్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలోనే రిలీజ్ కు సిద్ధమవుతుందని తెలుస్తోంది. ఈ సినిమా కొద్దిగా పాజిటివ్ టాక్ తెచ్చుకున్నా మోనాలిసాను తెలుగులో ఆపడం ఎవరితరం కాదు.



## అఖండ-2పై ఆసక్తికర పోస్ట్

### మూవీలో శంకర్ మహదేవ్, కైలాశ్ ఖేర్ పాటలు

తెలుగుతోపాటు పాన్ ఇండియా ప్రేక్షకులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటి అఖండ 2. బాలకృష్ణ , బోయపాటి శీను కాంబోలో వస్తోన్న ఈ సీక్వెల్ ప్రాజెక్ట్ డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుందని తెలిసిందే. మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేసిన అఖండ 2 టీజర్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. అఖండ ఫస్ట్ పార్ట్‌లో మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ బీజీఎం ఏ రేంజ్‌లో సినిమాకు హైలెట్‌గా నిలిచిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇక సీక్వెల్ ప్రాజెక్ట్‌లో అంతకుమించిన స్కోర్ గూస్ బంప్స్ తెప్పించేలా ఉండబోతుందని ఇప్పటివరకు వచ్చిన రషెస్ చెబుతున్నాయి.

కాగా మూవీ అండ్ మ్యూజిక్ లవర్స్‌కు థ్రిల్ అందించే అదిరిపోయే వార్త ఒకటి ఇప్పుడు ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న లెజెండరీ సింగర్స్‌లో టాప్‌లో ఉంటారు శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్. ఈ ఇద్దరు సింగర్స్ పాటలు దేశమంతా ఎక్కడో ఒకచోట మార్మోగుతుంటాయని తెలిసిందే. అఖండ 2 కోసం ఈ ఇద్దరు కలిసి పనిచేయబోతున్నారన్న వార్త హైప్ పెంచేస్తుంది. నవంబర్ 7న అఖండ 2 ఫస్ట్ సింగిల్ ప్రోమోను ప్రకటించనున్నారని తెలిసిందే. నవంబర్ 9న ఫుల్ ట్రాక్‌ను లాంచ్ చేయనున్నారు. ఈ పాటను శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్ పాడినట్టు థమన్ ప్రకటించడంతో ఓ వైపు పాటతోపాటు మరో సినిమాపై కూడా అంచనాలు పెరిగిపోతున్నాయి.





## ఎస్ఎస్ఎంబీ 29 మూవీపై వీడిన ఉత్కంఠ

### 15న గ్రాండ్ ఈవెంట్ నిర్వహిస్తున్న రాజమౌళి

ఇప్పుడు అంతటా మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కిస్తున్న' ఎస్ఎస్ఎంబి 29' గురించే చర్చ. ఈ నెలలో సినిమాకు సంబంధించి పెద్ద అప్డేట్ ఇస్తా అని రాజమౌళి ప్రకటించిన నేపథ్యంలో కొన్ని రోజులుగా నెట్టింట ఈ సినిమా పై చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే సినిమా టైటిల్ వదులుతార లేక మహేష్ బాబు లుక్ రివీల్ చేస్తారా అని అభిమానులు ఆతురతగా ఎదురు చూస్తున్నారు. అయితే దీని కోసం రాజమౌళి పెద్ద ఈవెంట్ ప్లాన్ చేసారు. ఈ విషయాన్నీ అయన తనయుడు కార్తికేయ అధికారికంగా ప్రకటించారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ నెల 15న ఈవెంట్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పోస్టు చేశారు. అలాగే ఈ సినిమా ఈవెంట్ ను 'జియో హాట్‌స్టార్' ఓటీటీ లో స్ట్రీమింగ్ కానుందంటూ వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో తన ట్వీట్‌కు ఓటీటీ సంస్థ ఖాతాను కార్తికేయ ట్యాగ్ చేయడంతో దీనిపై క్లారిటీ వచ్చింది. జియోహాట్ స్టార్ ఈ వీడియోను పోస్టు చేస్తూ ఇండియాలో 'ఎస్ఎస్ఎంబి 29' ఈవెంట్ తమ ఓటీటీలోనే స్ట్రీమింగ్ అవుతుందని తెలిపింది.

# కిక్కిరిసిన జనం..



- జనసంద్రమైన బుగులోని గుట్ట
- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు







**వరంగల్ వాయిస్, రేగొండ :** రేగొండ మండలం శ్రీ బుగులోని క్షేత్రం జనసంద్రమైంది. వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి క్షేత్రం పులకించిపోయింది. ఉమ్మడి రేగొండ మండలంలోని తిరుమలగిరిలో శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి వేల అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. మొదటి రోజు మంగళవారం జాతర ఆవరణంలో స్వామివారి గుట్ట కింద కళ్యాణం జరిపించారు. రెండో రోజు, మూడో రోజు భక్తులు భారీ సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తి గీతాలు, కోలాటాలు, నిత్యాలతో ఆ ప్రాంతం అంతా మార్మోగింది. భక్తులు స్తంభం చెట్టు చుట్టూ వాహనాలతో ప్రదిక్షణాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. బుగులోని వెంకటేశ్వర స్వామి గుట్ట కింద ఉన్న శివాలయంలో పరమేశ్వరుని ఆరాధనతో ఆధ్యాత్మిక కార్తిక శోభ సంచరించుకుంది. ఆలయం వద్ద మహిళలు పూజలతో దీపారాధన చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. భక్తులు గోవిందా నామస్మరణ చేస్తూ వెంకన్న స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు.

## తరలివస్తున్న భక్తజనం..

స్వామివారి సన్నిధికి భక్తుల భారీ సంఖ్యలో తరలివచ్చారు. జిల్లా నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వేంచేశారు. సాయంత్రం నుంచి సుదూరప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు విడిది చేస్తుండటంతో జాతర ప్రాంగణంలో సందడి నెలకొంది. రాత్రి పొద్దుపోయే వరకూ భక్తులరాక పెరుగుతూనే ఉంది. బుధవారం, గురువారం జాతర ప్రాంగణం, పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల వాహనాలతో జాతరకు వచ్చే అన్ని ప్రధానదారులు రద్దీ అయ్యాయి. బక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది.

## ప్రముఖుల మొక్కులు..

జాతరకు వచ్చిన పలువురు ప్రముఖులు, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు, నేతలకు ఆలయ కమిటీ శాలువాలు కప్పి స్వాగతం పలికారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గంట సత్యనారాయణ రావు వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే తెలంగాణ తొలి శాసనసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారీ, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి వేరువేరుగా స్వామి వారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. జాతర కార్య నిర్వహణ అధికారి బిల్ల శ్రీనివాస్, చైర్మన్ రమణ రెడ్డి వారికి స్వాగతం పలికారు.

## భారీ బందోబస్తు....

జాతరకు పోటెత్తిన భక్త జనాన్ని కంట్రోల్ చేయడం పోలీసులకు సవాల్ గా మారింది. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు పర్యవేక్షణలో ఘనపురం, చిట్యాల సీఐలు కర్ణాకర్ రావు, మల్లేష్ యాదవ్, స్థానిక ఎస్సైలు రాజేష్, త్రీ లోక్ నాథ్ రెడ్డి, గోరి కొత్తపల్లి ఎస్సై దివ్య,సెకండ్ ఎస్సై షా ఖాన్, పలువురు ఎస్సై లు, 150 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. గుట్ట వరకు మెట్ల మార్గం ద్వారా దర్శనానికి వెళ్లే భక్తుల క్రమబద్ధీకరణ దర్శనం ముగిసే వరకు బందోబస్తును పకడ్బందీగా నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

## మెరుగైన వైద్య సేవలు..

బుగులోని జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని భూపాలపల్లి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్ వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. బుగులోని వెంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య అధికారి డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జాతరలో సందర్శించి అక్కడ అందిస్తున్నటువంటి సేవలను ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతోమంది భక్తులకు వైద్య సేవలు అందించాలని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరంలో డాక్టర్ దీప్తి, డాక్టర్ సుభాష్ చారి, సూపర్వైజర్ వినోదాలక్ష్మి, ఏఎన్ఎంలు దీన, మంజుల, ఆశలు కవిత, జ్యోతి, శైలజ, సునీత తదితరులు పాల్గొన్నారు.




# చరిత్రాత్మక ఓరుగల్లులో..

- ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్ ప్రారంభం
- ముఖ్యఅతిథిగా హాజరైన నటి శ్రీలీల

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రీటైల్ వ్యాపారంలో బ్రాండ్ ఇమేజ్ సృష్టించిన ఆర్ఎస్ బ్రదర్స్ దక్షిణ భారతదేశంలో విస్తరణలో భాగంగా గురువారం తెలంగాణలో చారిత్రక వరంగల్ నగరంలో తమ సరికొత్త షోరూమ్ ను అంగరంగ వైభోగంగా శుభారంభం చేసింది. వ్యాపారరంగంలో ప్రముఖ దార్శనికులైన పి.వెంకటేశ్వర్లు, ఎస్. రాజమౌళి, టి.ప్రసాదరావు, దివంగత పి.సత్యనారాయణ దూర దృష్టితో ప్రణాళికాబద్ధంగా నెలకొల్పిన ఆర్ఎస్ బ్రదర్స్ సంస్థ – సంప్రదాయాన్ని, ఆధునిక ఫ్యాషన్లను మేళవించి భారతదేశ వ్యాప్తంగా కొనుగోలుదారులకు చేరువవుతోంది. అందులో భాగంగా వరంగల్‌లోని సరికొత్త షోరూమ్ వైవిధ్యభరితమైన అభిరుచులు కలిగిన నగరవాసుల హృదయాల్ని చూరగొనేలా ప్రారంభించింది. ప్రముఖ సినీతార శ్రీలీల ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతిని వెలిగించి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా నూతన షోరూమ్‌ను సందర్శించి వరంగల్‌లోని షాపింగ్ ప్రియులకు ఇది అందమైన కొనుగోలు గమ్యంగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ బ్రదర్స్ రీటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ డైరెక్టర్లు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ వినియోగదారుల అభిరుచుల వైవిధ్యానికి తగినట్లుగా తమ బ్రాండ్ మరింతగా విస్తరిస్తుందన్నారు. మారుతున్న పోకడలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నాణ్యతతోపాటు సరసమైన ధరలతో కొత్తదనాన్ని అందించగలమని, ఇతర ప్రాంతాలలో కూడా కొత్త షోరూమ్స్ నెలకొల్పనున్నామని చెప్పారు. వరంగల్‌లో షోరూమ్‌లో అన్ని తరాల అభిరుచులను ప్రతిబింబించే ఉమెన్స్‌వేర్, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్ రూ.149ల ప్రారంభ ధరతో కొనుగోలుదారులను ఆకట్టుకున్నాయి. కంచిపట్టు చీరలు, డిజైనర్ లెహెంగాలు మొదలుకుని పర్వదినాల్లో ధరించే కుర్తాలు, ఆకర్షణీయమైన వెస్ట్రన్‌వేర్ వంటివి కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి. సంస్థ చైర్‌పర్సన్, హోల్ టైం డైరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు తమ వరంగల్ షోరూమ్‌లో వెడ్డింగ్ కలెక్షన్స్, పెళ్లి కుమార్తె సంప్రదాయ వస్త్రాలంకరణకు సంబంధించిన సాధికారికమైన పనితనంలోని ప్రత్యేకత గురించి వివరించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీర్ణ రాజమౌళి మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా కొనుగోలుదారుల అభిరుచుల్ని, తాజా ఫ్యాషన్లను ప్రతిబింబించే వస్త్రశ్రేణి తమ వద్ద లభిస్తోందని చెప్పారు. హోల్ టైం డైరెక్టర్ తిరువీధుల ప్రసాదరావు వరంగల్ వాసులకు హృదయపూర్వక స్వాగతం పలుకుతూ వరంగల్‌లోని కొనుగోలుదారులు మెచ్చుకునే వైవిధ్యభరిత వస్త్రశ్రేణి ఆకర్షణీయమైన ఫ్యాషన్లతో, అందుబాటు ధరలలో ఒకే చోట లభిస్తోందన్నారు. పండగలు, వివాహాది శుభకార్యాలకు అవసరమైన షాపింగ్ కోసం తమ షోరూమ్‌కి విచ్చేయాల్సిందిగా కోరారు.

# ఏసీబీ ట్రాప్ లో ఏఈఓ

- రైతు బీమా కోసం లంచం డిమాండ్
- రెడ్ హాండెండ్ గా పట్టుకున్న అధికారులు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం నీలికుర్తి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) గా భాద్యతలు నిర్వహిస్తున్న గాడిపల్లి సందీప్ ను ఏసీబీ అధికారులకు గురువారం పట్టుకున్నారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం మరిపెడ మండలంలోని అనేపురం గ్రామానికి చెందిన రైతు బిక్కు అక్టోబర్ 14వ తేదీన మరణించాడు. ఈయనకు రైతు బంధు పథకం అమలులో ఉంది. బిక్క మరణాంతరం నామినీగా ఆయన కుమారుడు గత నెల 30వ తేదీన అన్ని ధ్రువీకరణ పత్రాలతో మరిపెడ అగ్రికల్చర్ ఆఫీసులో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో అనేపురం క్లస్టర్ ఏఈఓగా విధులు నిర్వహిస్తున్న సందీప్ సదరు రైతు బీమా ధృవీకరణ దరఖాస్తు పత్రాలను ప్రభుత్వానికి ఆన్ లైన్ ద్వారా సమర్పించేందుకు నామినీ నుంచి రూ. 20 వేలు డిమాండ్ చేశారు. దీంతో నామిని ఏసీబీ అధికారులను సంప్రదించగా వారి సూచన మేరకు గురువారం మండల కేంద్రంలోని ఓ ప్రదేశంలో రూ.10 వేల తీసుకుంటుండగా రెడ్ హ్యాండెంగా పట్టుకున్నట్లు డీఎస్పీ సాంబయ్య వెల్లడించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com